క్లుప్తంగా

మండల స్థాయి చెస్ టోర్నమెంట్



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న హెచ్ఎం రామాంజనేయులు

దొనకొండ: బాలల దినోత్సవం సందర్భంగా స్థానిక గౌతమి డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో గురువారం మండల స్థాయి చెస్ టోర్నమెంట్ నిర్వహించారు. టోర్నమెంట్‌లో జెడ్పీ, జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీ విద్యార్థులు 14 మంది పాల్గొన్నారు. జెడ్పీ 10వ తరగతి విద్యార్థి వెంకట లక్ష్మీ నారాయణరావు చాంపియన్‌గా నిలిచారు. రన్నర్‌గా డిగ్రీ కళాశాల విద్యార్థి పవన్ నిలిచారు. విజేతలకు జెడ్పీ ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. కళాశాల అడ్మిన్ నాని, ప్రిన్సిపాల్ రామయోగి, అధ్యాపకులు దేవదానం, వెంకటేశ్వరరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీశైలానికి భక్తుల రద్దీ



గణపతి చెక్‌పోస్టు వద్ద వాహనాలు

పెద్దదోర్నాల: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ప్రసిద్ధి గాంచిన శ్రీశైల పుణ్యక్షేత్రానికి భారీగా తరలి వచ్చే భక్తులతో గురువారం మండల కేంద్రంలో భారీ రద్దీ ఏర్పడింది. దీంతో మండలంలోని శ్రీశైలం రహదారులు వాహనాలతో కిక్కిరిసాయి. రాష్ట్ర నలుమూలాల నుంచి భక్తులు శ్రీశైలం పుణ్యక్షేత్రానికి భారీగా తరలి వస్తుండటంతో మండలంలో ట్రాఫిక్ రద్దీ ఏర్పడింది. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని జిల్లాలోని పలు ప్రాంతాలతో పాటు గుంటూరు, కర్నూలు ప్రాంతాల నుంచి శ్రీశైలానికి అధికంగా యాత్రికులు తరలి వస్తుండటంతో ఎస్సై మహేష్ ట్రాఫిక్ ఇబ్బందులు తొలగించేందుకు పలు ప్రాంతాల్లో సిబ్బందిని నియమించారు.

ట్రూ అప్ విద్యుత్ చార్జీలు రద్దు చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

దర్శి: ట్రూ అప్ విద్యుత్ చార్జీలు రద్దు చేయాలని సీపీఎం కార్యదర్శి తాండవ రంగారావు డిమాండ్ చేశారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం ఆధ్వర్యంలో గురువారం ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ వ్యతిరేక నినాదాలు చేసి డిప్యూటీ తహసీల్దార్ వెంకటేష్‌కు డిమాండ్స్‌తో కూడిన వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రజావ్యతిరేక విధానాలపై వారం రోజుల పాటు ఇంటింటా ప్రచారం చేసి నిరసన తెలుపుతున్నామని సీపీఎం నాయకులు చెప్పారు. ఎన్నికలకు ముందు కూటమి నాయకులు విద్యుత్ చార్జీలు పెంచమని చెప్పి ఇప్పుడు దొడ్డి దారిన ప్రజలపై రూ.20 వేల కోట్లు అదనపు చార్జీలు మోపుతున్నారన్నారు. అధికారంలో ఉంటే ఒక మాట లేకపోతే మరోమాట చెప్పు బీజేపీ, టీడీపీ ప్రజలను మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. ప్రజావ్యతిరేక నిర్ణయాలు చేయకుండా పాలన కొనసాగించాలని, కాని పక్షంలో ప్రజలను ఐక్యం చేసి పెద్ద ఎత్తున పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. సీపీఎం, సీఐటీయూ, డీవైఎఫ్ఐ నాయకులు కేవీ పిచ్చయ్య, ఉప్పు నారాయణ, ఈమని నాగేశ్వరరావు, గోగు వెంకయ్య, అంజిబాబు, గర్నిపూడి శామ్యేల్, పొట్లూరి పుల్లయ్య, కొమరగిరి కోటేశ్వరరావు పాల్గొన్నారు.

విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలి



బహుమతులు అందుకుంటున్న విద్యార్థులు

దర్శి: విద్యార్థులు సేవాభావం అలవర్చుకోవాలని విశ్రాంత ఆర్జేడీ భీమన్న సూచించారు. స్థానిక కస్తూరిబా గాంధీ బాలికా విద్యాలయంలో మానవత స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాలల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రసూతి వైద్యురాలు బాదం లక్ష్మీప్రసన్న బాలికలకు ఆరోగ్య విషయాలపై పలు సూచనలు సలహాలు అందజేశారు. సంస్థ తరఫున వక్తృత్వ, వ్యాసరచన, చిత్ర లేఖనం పోటీలు నిర్వహించి గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా భీమన్న మాట్లాడుతూ విద్యార్థులు పోటీతత్వంతో విద్యను, విద్యతో పాటు మంచి అలవాట్లను అలవర్చుకోవాలని చెప్పారు. ప్రతి విద్యార్థి మంచి మనస్సుతో ఆలోచించేలా తమ జీవిత ప్రయాణం ఉండాలన్నారు. ప్రిన్సిపాల్ అరుణ, సంస్థ చైర్మన్ దేవతి వరప్రసాద్, కన్వీనర్ కపురం శ్రీనివాసరెడ్డి, అధ్యక్షుడు దనిరెడ్డి వెంకటరెడ్డి, కోశాధికారి గొర్రెపాటి వేణు, హెల్త్ అడ్వైజర్ జె.సుశీలమ్మ పాల్గొన్నారు.

వీధి కుక్కలతో భద్రం

- కుక్కల సంచారంతో హడల్
- గ్రామీణ ప్రాంతాల్లో చిన్నారుల ఆందోళన



వీధుల్లో సంచరిస్తున్న కుక్కలు

పెద్దదోర్నాల:

గ్రామ సింహాలుగా పేరుపొందిన వీధికుక్కలతో మండల ప్రజలు హడలెత్తిపోతున్నారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో వీధి కుక్కలు యథేచ్ఛగా స్వైర విహారం చేస్తున్నాయి. విచ్చలవిడిగా ప్రజలపై దాడులు చేస్తూ గాయపరుస్తున్నాయి. ప్రజలు వీటిని చూస్తేనే హడలి పోతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే పిచ్చికుక్కల బెడద ఎక్కువ. దీంతో వర్షం పడితే ప్రజలు బెంబేలెత్తిపోతున్నారు. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ఎవరో ఒకరు కుక్కకాటుకు గురవుతున్నారు. అయినా అధికారుల్లో స్పందన కనబడటం లేదని బాధితులు ఆరోపిస్తున్నారు. కుక్కల బెడద నుంచి తప్పించేందుకు ప్రజా ప్రతినిధులు ఎటువంటి చర్యలు చేపట్టడం లేదని వారు విమర్శిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో అయితే వీధికుక్కలు ద్విచక్ర వాహనాల వెంట పరుగులు తీస్తుండటంతో కొన్నిచోట్ల వాహనచోదకులు అదుపుతప్పి గాయపడుతున్నారు. నోటి వెంట లాలాజలంతో పిచ్చికుక్కలు సంచరిస్తుండడంతో రాత్రి పూట గ్రామీణ ప్రాంత ప్రజలు బిక్కుబిక్కుమంటూ కాలం వెళ్లదీస్తున్నారు. ఇటీవల మండల కేంద్రంలో పిచ్చికుక్క చెలరేగిపోయి కనపడిన వారిని కనబడినట్లు దాడి చేయటంతో పలువురికి గాయాలయ్యాయి. నిత్యం ఏదో ఒక ప్రాంతంలో ఎవరో ఒకరు కుక్కకాటుకు గురవుతున్నారు. కుక్కకాటుకు గురైనవారు మండల కేంద్రంలోని పలు ప్రైవేటు వైద్యశాలల్లో చికిత్స పొందుతున్నారు. ప్రభుత్వ వైద్యశాలలో వ్యాక్సిన్ అందుబాటులో ఉన్నా అవగాహన లేక కొందరు ప్రైవేటు వైద్యశాలలను ఆశ్రయిస్తున్నారని వైద్యాధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి గ్రామాల్లో విచ్చలవిడిగా సంచరిస్తున్న వీధి కుక్కలను పట్టుకుని సుదూర ప్రాంతాల్లో వదిలేలా చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుకుంటున్నారు.

> **వ్యాక్సిన్ అందుబాటులో ఉంది: డాక్టర్ మహేశ్వరి,**
>
> 
>
> వీధికుక్కలతో కొంచెం జాగ్రత్తగా ఉండాలి. కుక్కలు కరిస్తే ప్రభుత్వ వైద్యశాలలో యాంటీ రేబిస్ వాక్సిన్ అందుబాటులో ఉంది. ఏదైనా కుక్క కరిస్తే అది మంచిదా, పిచ్చిదా.. అని నిర్ధారణ చేసుకోవాలి. పిచ్చి కుక్క అయితే తప్పని సరిగా నాలుగు డోసుల ఇంజెక్షన్ వేయించుకోవాలి.
>
> సూపరింటెండెంట్, సామాజిక ఆరోగ్య కేంద్రం, పెద్దదోర్నాల

విషయ పరిజ్ఞానం అవసరం



పుల్లలచెరువు: మానవహారంగా ఏర్పడిన విద్యార్థులు, అధికారులు

పెద్దారవీడు: విద్యార్థులు విషయ పరిజ్ఞానంతో ముందుకు సాగితే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చని ఎంపీడీఓ ఎస్.జాన్‌సుందరం, ఎంఈఓ పి.శ్రీనివాసులు, డిప్యూటీ తహసీల్దార్ ఖలీల్ అన్నారు. గురువారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్ఎం కనుకదుర్గ ఆధ్వర్యంలో బంగారు బాలోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదువుకోవాలని, పాఠశాలల విద్యలోనే విద్యార్థులు ఉన్నత స్థితికి వెళ్లేందుకు బీజం పడుతుందన్నారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా ఉపాధ్యాయులు చెప్పిన విధంగా చదువుకుంటే ప్రతి విద్యార్థి గొప్ప స్థాయికి చేరుకుంటారని చెప్పారు. విద్యార్థి దశ నుంచి చట్టాలపై అవగాహన పెంచుకున్నప్పుడే, ప్రశ్నించే తత్వాన్ని అలవాటు చేసుకున్నప్పుడే న్యాయం జరుగుతుందని తెలిపారు. బాల కార్మికులు లేని వ్యవస్థ నిర్మూలించడం, బాల్య వివాహాలు అరికట్టాలని, బాలల హక్కులను కాపాడే అంశాలపై వివరంగా మాట్లాడారు. అనంతరం అధికారులు, విద్యార్థులు ప్రతిజ్ఞ చేశారు. ఆర్ఐ గోపి, గ్రంథపాలకుడు ఏర్వ వెంకటేశ్వరరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పుల్లలచెరువు: ప్రతి ఒక్కరూ బాలల జీవితాన్ని బంగారు భవిష్యత్‌గా తీర్చిదిద్దేందుకు, వారి బాల్యాన్ని బంగారు మయం చేసేందుకు కృషి చేయాలని ఎంపీడీవో వసంతరావునాయక్ అన్నారు. కలెక్టర్ ఆదేశాలపై గురువారం మండల కేంద్రంలో విద్యార్థులు, అధికారులు పాల్గొని బంగారు బాల్యంపై ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎంపీడీవో మాట్లాడుతూ బంగారు బాల్యం కార్యక్రమం వారం రోజుల పాటు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు. బాలలు ముఖ్యంగా వారికి ఉన్న హక్కులు, విధులు తెలుసుకోవాలని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు విద్య చెప్పించాలని, వారు చక్కగా విద్యను అభ్యసించినప్పుడు దేశం అభివృద్ధి దిశలో పయనిస్తుందన్నారు. ప్రతి ఒక్కరూ చేయి చేయి కలిపి బాలల భవిష్యత్‌ను బంగారు బాటలుగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలన్నారు. నేటి బాలలే రేపటి పౌరులన్నారు. ఎంఈవో ఇందిర, ఈవోఆర్డీ శ్రీనివాసరావు, డాక్టర్ లక్ష్మీనరసింహ, కేజీబీవీ ప్రిన్స్‌పాల్ లిల్లీప్రకాశ్‌వాణి, ఐసీడీఎస్ అధికారి శివలక్ష్మి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం: బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో బాలల దినోత్సవం సందర్భంగా పలు కార్యక్రమాలు నిర్వహించారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాసులు, ఎంపీడీఓ రాజ్‌కుమార్, ఎంఈఓలు కె.తులసి మల్లికార్జున నాయక్, టి.రాజశేఖర రెడ్డి, ప్రధానోపాధ్యాయుడు శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. గణపవరం ఏపీఆర్ స్కూల్లో ప్రిన్సిపాల్ మోహన్‌రెడ్డి, దూపాడు ఏపీఎస్‌డబ్ల్యూఆర్ కళాశాలలో ప్రిన్సిపాల్ మధురవాణి బాలల దినోత్సవాల్లో పాల్గొని విద్యార్థులకు సందేశం అందించారు. పాఠశాలల్లో విద్యార్థులచే సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. నెహ్రూ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మిఠాయిలు, చాక్లెట్స్ పంపిణీ చేశారు.

కురిచేడు: జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా మండలంలోని ఎస్సీ కాలనీ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు గురువారం పుస్తకాలు బహూకరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వి.స్వాతి, ఎంఈఓలు వస్తంనాయక్, సుబ్బారావులు పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. చిరిగిన చొక్కా అయినా తొడుక్కో ఒక మంచి పుస్తకం కొనుక్కో అన్న కందుకూరి వీరేశలింగం పంతులు ఆలోచనను ఆచరణలో పెడుతూ ప్రవాస భారతీయ వాసవి సంఘం పాఠశాలకు రూ.15 వేల విలువైన పుస్తకాలు అందజేశారు. పుస్తకాలను పాఠశాల విద్యార్థినీ, విద్యార్థులకు పరిచయం చేశారు. ఈ పుస్తకాలను గ్రంథాలయాన్ని విద్యార్థులకు వాడుకలోకి తేవాలని ప్రధానోపాధ్యాయురాలు తెలిపారు. పాఠశాల ఉపాధ్యాయులు పూర్ణచంద్రరావు, అంకయ్య, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు పాపారావు, ఎస్ఎంసీ చైర్మన్ సంపూర్ణ గ్రామస్తులు పాల్గొన్నారు.

దర్శి: మండలంలోని కట్టశింగన్నపాలెం ప్రాథమిక పాఠశాలలో బాలల దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. జవహర్ లాల్ నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఉపాధ్యాయులు గొర్రెపాటి వేణు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, చిన్నారులు ఉపన్యాసాలు, పాటలు, నృత్యాలు, నెహ్రూ వేషధారణలు అందరినీ అలరింపజేశాయి. ఉపాధ్యాయులు సయ్యద్ సుభానీ, సీహెచ్ హైమావతి, అంగన్‌వాడీ టీచర్ వెంకటరమణ పాల్గొన్నారు.

పెద్దదోర్నాల: మండల కేంద్రంలోని శాఖా గ్రంథాలయంలో బాలల దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీడీఓ నాసర్‌రెడ్డి, ఎంఈఓ మస్తాన్‌నాయక్, ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నారాయణరెడ్డి పాల్గొన్నారు. చాచా నెహ్రూ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. భ్రమరాంబ డిగ్రీ కళాశాలలో బాలల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు.చాచా నెహ్రూ చిత్రపటానికి కరస్పాండెంట్ రమణారెడ్డి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు

గ్రంథాలయ వారోత్సవాలు ప్రారంభం



త్రిపురాంతకం: చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు

పెద్దారవీడు: స్థానిక శాఖా గ్రంథాలయంలో గంథపాలకుడు ఏర్వ వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఎంఈఓ పి.శ్రీనివాసులు గురువారం ప్రారంభించారు. బాలల దినోత్సవం సందర్భంగా భారత తొలి ప్రధాని జవవాహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన అనంతరం జాతీయ పతాకాన్ని ఆవిష్కరించారు. ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థులు గ్రంథాలయానికి వచ్చి పత్రికలు, పుస్తకాలు చదవడంతో దేశంలో జరుగుతున్న విషయాలతో పాటు మంచి విజ్ఞానం పెరుగుతుందని చెప్పారు. విద్యార్థులు బాగా చదువుకొని ఉన్నత శిఖారాలు అధిరోహించాలని ఆకాంక్షించారు. విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. గ్రామస్తులు, విద్యార్థులు పాల్గొన్నారు.

త్రిపురాంతకం: గ్రంథాలయ వారోత్సవాల సందర్భంగా విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. త్రిపురాంతకం శాఖ గ్రంథాలయంలో జరిగిన కార్యక్రమంలో వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొన్నారు. వారోత్సవాల్లో రోజూ ఒక కార్యక్రమాన్ని నిర్వహించి విజేతలకు బహుమతులు అందజేయనున్నట్లు గ్రంథపాలకుడు రామాంజి నాయక్ తెలిపారు. శ్రీశ్రీ కళావేదిక కార్యదర్శి నాసరయ్య, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

కురిచేడు: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థులు గురువారం ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి లయన్స్ క్లబ్ ప్రెసిడెంట్ వీవీ రమణారావు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం 30 మంది విద్యార్థులకు గ్రంథపాలకురాలు ఎల్.సుమతి గ్రంథాలయ సభ్యత్వం ఇచ్చారు. గ్రంథాలయ ఉపయోగాల గురించి వీవీ రమణారావు వివరించారు. జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు, ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

దర్శి: గ్రంథాలయాలు జ్ఞాన నిలయాలని సంఘ సేవకుడు జీవీ రత్నం సూచించారు. స్థానిక గ్రంథాలయంలో జాతీయ గ్రంథాలయం వారోత్సవాలు గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. జీవీ రత్నం మాట్లాడుతూ గ్రంథాలయాలు సందర్శిస్తే విద్యార్థుల దృష్టికి అనేక కొత్త విషయాలు వస్తాయని చెప్పారు. ప్రతి విద్యార్థి పుస్తకం చదవడం తప్పని సరిగా అలవర్చుకోవాలన్నారు. గ్రంథాలయ పాలకురాలు వి.విజయకుమారి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సంఘ సేవకులు వెంకటరెడ్డి, జీహెచ్ఎస్ ప్రధానోపాధ్యాయుడు కలేషా, పీఈటీ ప్రతాప్, బీడీసీఎల్ నిర్వాహకులు కె.నాగార్జునరెడ్డి, బి.కోటయ్య, చెంచులింగం, సుధాకర్ పాల్గొన్నారు.

యర్రగొండపాలెం: బాలల దినోత్సవం సందర్భంగా గ్రంథాలయ వారోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ముందుగా పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు ఏర్పాటు చేసిన చిత్రలేఖనం పోటీల్లో గెలుపొందిన కె.అస్మిత, జి.లక్ష్మి భావన, షేక్ అబిదాలకు బహుమతులు అందజేశారు. ఆయా కార్యక్రమాల్లో ఎంఈవో పి.ఆంజనేయులు, గ్రంథపాలకురాలు కె.రూన్సీ, మోడల్ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీధర్ నాయుడు, ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ ప్రిన్సిపాల్ సురేష్ బాబు, హెచ్ఎంలు ఈర్ల రమాదేవి, జె.వెంకటేశ్వర్లు, రోషమ్మ, కె.బాలునాయక్, కె.సాయికృష్ణ పాల్గొన్నారు

జాతీయ రహదారిపై జీఐఎస్ సర్వే



సర్వే చేస్తున్న జీఐఎస్ టీం

యర్రగొండపాలెం: భారతీయ రవాణా మంత్రిత్వ శాఖ (మోర్త్) ఆదేశాల మేరకు గురువారం స్థానిక 565 జాతీయ రహదారిపై జీఐఎస్ (భౌగోళిక సమాచారం) సర్వేను ప్రారంభించారు. పుల్లలచెరువు మండలం మల్లాపాలేనికి సమీపం నుంచి ప్రారంభమైన సర్వేలో రహదారి విస్తీర్ణం, భవిష్యత్తులో ఏ మేరకు విస్తరింప చేయాలి, బైపాస్ రోడ్డు ఎక్కడ ఏర్పాటు చేయాల్సి ఉంటుంది, పాఠశాలల వద్ద చేయాల్సిన రక్షణ ఏర్పాట్లు, రహదారిపై ఎక్కడెక్కడ బస్‌స్టాప్‌లు ఏర్పాటు చేయాల్సి ఉంటుంది, వాహనాలు సజావుగా తిరిగేందుకు తొలగించాల్సిన ఆక్రమణలు లాంటి విషయాలపై సర్వేను నిర్వహిస్తున్నట్లు సర్వేయర్ బాలకృష్ణ తెలిపారు.

పంటల బీమాను వినియోగించుకోవాలి



పొగాకు పంటను పరిశీలిస్తున్న ఏఓ మధుబాబు

కురిచేడు: ప్రదాన మంత్రి ఫసల్ బీమా యోజన (పంటల బీమా) ను రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి పి. మధుబాబు తెలిపారు. పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా గురువారం ఆయన మండలంలోని బోధనంపాడు, పేరంబొట్లపాలెం గ్రామాల్లో సాగు చేసిన పంటలను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ శనగ, మినుము, మొక్కజొన్న, జొన్న, ఎండు మిరప వంటి పంటలకు డిసెంబర్ 15వ తేదీ, వరి పంటకు డిసెంబర్ 31వ తేదీ చివరి తేదీగా ప్రభుత్వం గడువు విధించినట్లు పేర్కొన్నారు. పంటలు వేసిన రైతులు తప్పనిసరిగా ప్రీమియం నగదును దగ్గరలోని సీఎస్‌సీ, నెట్ సెంటర్‌లో చెల్లించి రసీదు పొంది భద్ర పరచుకోవాలన్నారు.

శిక్షణకు అధికారులు, ప్రజాప్రతినిధుల డుమ్మా

- ఖాళీ కుర్చీలకు శిక్షణ తరగతులు
- ప్రజా సంక్షేమంపై చిత్తశుద్ధి శూన్యం



శిక్షణ తరగతులకు హాజరైన కొద్దిమంది ప్రజాప్రతినిధులు, అధికారులు

కురిచేడు: గ్రామ పంచాయతీల అభివృద్ధి ప్రణాళిక, మండల ప్రజాపరిషత్ అభివృద్ధి సమగ్ర కార్యాచరణ ప్రణాళిక తయారు చేసేందుకు మార్గదర్శకాలు సూచిస్తూ ఇచ్చే శిక్షణ కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు డుమ్మా కొట్టారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో గురువారం మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లోని ప్రజాప్రతినిధులు, అన్ని శాఖల అధికారులతో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఉదయం పూట 8 గ్రామ పంచాయతీల్లోని వారికి, సాయంత్రం 7 పంచాయతీలకు సంబంధించిన వారికి శిక్షణ ఇచ్చారు. ఉదయం జరిగిన కార్యక్రమానికి పంచాయతీ కార్యదర్శులు, ఒకరిద్దరు సర్పంచ్‌లు, జెడ్పీటీసీ నుసుం వెంకట నాగిరెడ్డి, పడమర గంగవరం సర్పంచ్ కాసు భాస్కరరెడ్డి, కురిచేడు-3 ఎంపీటీసీ ఆవుల లక్ష్మి వెంకటరెడ్డి, కొంతమంది వైద్య సిబ్బంది హాజరయ్యారు. ఇంతకు మించి ఏ ఒక్కరూ హాజరు కాకపోవటంతో శిక్షణ మొక్కుబడిగా జరిగింది. శిక్షణకు హాజరు కాని ప్రజాప్రతినిధులు, మండల స్థాయి అధికారులు సమగ్ర కార్యాచరణ ప్రణాళిక ఎలా తయారు చేస్తారో జిల్లా ఉన్నతాధికారులకే తెలియాల్సి ఉంది. ప్రభుత్వ సమావేశాలకే హాజరు కాకుండా నిర్లక్ష్యంగా వ్యవహరించే అధికారులు వారి విధుల పట్ల ఎంత బాధ్యతగా వ్యవహరిస్తున్నారో అర్థమవుతోంది. ప్రభుత్వం మొక్కుబడి కార్యక్రమాలు నిర్వహించి ప్రగతి ఎలా సాధిస్తుందోనని పలువురు ప్రశ్నిస్తున్నారు.

పంచాయతీలపై అవగాహన ఉండాలి



త్రిపురాంతకం: మాట్లాడుతున్న ఎంపీడీఓ రాజ్‌కుమార్

త్రిపురాంతకం: గ్రామ పంచాయతీలను అభివృద్ధి పరిచేందుకు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తగిన అవగాహన కలిగి ఉండాలని ఎంపీడీఓ రాజ్‌కుమార్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గురువారం గ్రామ సర్పంచ్‌లు, ఎంపీటీసీలకు జీపీడీపీ శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రాజ్‌కుమార్ మాట్లాడుతు గ్రామాల్లో అనునిత్యం పర్యటించే అందరికీ గ్రామ సమస్యలపై అవగాహన ఉంటుందన్నారు. వాటిని పరిష్కరించుకునేందుకు అవసరమైన నిధులు ఏ విధంగా ఖర్చు చేయాలి, నిధుల కేటాయింపు ఏ విధంగా ఉంటుందన్న దానిపై అవగాహన అవసరమన్నారు. గ్రామాల్లో రోడ్లు, సైడ్ డ్రైన్స్, వీధిలైట్లు నిర్వహణ, తాగునీటి పంపిణీ ప్రతి విషయంపై అవగాహన కలిగి ఉంటేనే ప్రజలకు సేవలందుతాయని వివరించారు. గ్రామాన్ని పరిశుభ్రంగా ఉండే విధంగా అందరు కృషి చేయాలని పిలుపు ఇచ్చారు. ఈఓపీఆర్డీ రామసుబ్బయ్య, ఏపీఎం ఎడ్వర్డ్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దారవీడు: గ్రామాల అభివృద్ధి కోసం ప్రజాప్రతినిధులు కృషి చేయాలని ఎంపీడీఓ ఎస్.జాన్‌సుందరం అన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో మండల, గ్రామస్థాయిలో ఎన్నికైన ప్రజాప్రతినిధులకు, మండల స్థాయి అధికారులకు గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై అవగాహన కల్పించేందుకు ఈఓఆర్డీ కేజీఎస్ రాజు ఆధ్వర్యంలో గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. తొలుత మహాత్మా గాంధీ, జవహర్‌లాల్ నెహ్రూ చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధి కోసం అధికారులు, ప్రజాప్రతినిధులు సమష్టిగా కృషి చేయాలని కోరారు. గ్రామ పంచాయతీల అభివృద్ధికి మండల స్థాయి అధికారులు గ్రామాల్లో పర్యటించి చేపట్టబోయే ముఖ్యమైన పనులు గుర్తించాలని, ప్రజలకు అవసరాలు తీరేలా సమగ్ర ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయం పాల్గొన్నారు.

దర్శి: 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు తయారు చేయాలని ఎంపీపీ సుధారాణి సూచించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈఓఆర్డీ సుధాకర్ అధ్యక్షతన గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలు తయారు చేసేందుకు గురువారం శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా 12 పంచాయతీలకు సంబంధించి శిక్షణ ఇచ్చారు. ఎంపీపీ మాట్లాడుతూ ప్రజా ప్రణాళిక ఉద్యమం ద్వారా పెద్ద ఎత్తున గ్రామ ప్రజలు భాగస్వామ్యంతో పంచాయతీ అభివృద్ధికి గ్రామ సభల ఆమోదంతో పొందుపరుచుకోవాలన్నారు. ఈఓఆర్డీ సుధాకర్ ప్రణాళికలు, ఆన్‌లైన్, తదితర పద్ధతులపై శిక్షణ ఇచ్చారు. సర్పంచ్‌లు, కార్యదర్శులు పాల్గొన్నారు.

దొనకొండ: పంచాయతీలు అభివృద్ధి చేసుకునేందుకు 2025-26 ఏడాదికి ముందస్తు ప్రణాళిక సిద్ధం చేయాలని ఎంపీడీఓ ఎం.శ్రీదేవి తెలిపారు. స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ప్రజాప్రతినిధులకు, అధికారులకు గురువారం ఒక రోజు శిక్షణ ఇచ్చారు. కార్యక్రమానికి ఎంపీపీ బొరిగొర్ల ఉషామురళి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. గాంధీజీ కలలుగన్న గ్రామ స్వరాజ్యంలా పంచాయతీలు అభివృద్ధి చేసుకోవాల్సిన బాధ్యత ప్రజాప్రతినిధులు, అధికారులపై ఉందన్నారు. పంచాయతీ నిధులతో పారిశుధ్య కార్యక్రమం, తాగునీరు, విద్యుత్ దీపాలు, అంతర్గత రోడ్లు, సైడు కాలువలు అభివృద్ధి చేసుకోవాలన్నారు. కుటుంబాల జీవనోపాధి మెరుగు పరుచుకోవటం, ఆదాయ అభివృద్ధి కార్యక్రమాలకు ప్రణాళికలు వెలుగు శాఖ ద్వారా తయారు చేసుకోవటం, గ్రామీణ పేదరిక నిర్మూన సర్వే ద్వారా అన్ని శాఖల అధికారులు ప్రణాళికను సిద్ధం చేసుకోవాలని ఎంపీపీ తెలిపారు. ఈఓఆర్డీ ఆదాం షఫీ, అన్ని శాఖల అధికారులు, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, వీఓఏలు పాల్గొన్నారు.


తహసీల్దార్ కార్యాలయం వద్ద ప్రజాపోరు



డీటీకి వినతిపత్రం ఇస్తున్న సీపీఎం నాయకులు

దొనకొండ: స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద సీపీఎం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు గురువారం ప్రజాపోరు చేపట్టి అధిక ధరలకు వ్యతిరేకంగా ఆందోళన చేపట్టారు. మహిళలపై దాడులు, అత్యాచారాలు అరికట్టాలని, విద్యుత్ వినియోగదారులపై రూ.20 వేల కోట్ల అదనపు చార్జీలు రద్దు చేయాలని, నిత్యావసర సరుకుల ధరలు తగ్గించాలని, ఉచిత ఇసుక విధానం అమలు చేయాలని, ప్రభుత్వ శాఖలో ఖాళీ ఉద్యోగాలు భర్తీ చేయాలని, నిరుద్యోగులకు భృతి కల్పించాలని, విశాఖ ఉక్కు ప్రైవేటీకరణ ఆపాలని, నూనెపై కేంద్ర ప్రభుత్వం విధించిన 24 శాతం ఎక్సైంజ్ సుంకాన్ని ఉప సంహరించుకోవాలని, పేదల గృహాల్లో బిగించే స్మార్ట్ మీటర్లను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉప సంహరించుకోవాలని, పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టుకు రూ.2 వేల కోట్లు కేటాయించాలని, నిర్వాసితులకు ఆర్అర్ ప్యాకేజీ వెంటనే ఇచ్చి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం రీ సర్వే డీటీ నాగార్జునరెడ్డికి వినతిపత్రం అందజేశారు. సీపీఎం మండల కార్యదర్శి చిరుపల్లి అంజయ్య, కుందుర్తి చిన్న నరసింహులు, కోలా కిరణ్, ఉదయ్, ఫ్రాన్సిస్, రమణయ్య, పి.కాశయ్య, జె.ప్రసాద్, సంతోష్, కొండయ్య, వెంకటయ్య పాల్గొన్నారు.

జెడ్పీ విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



క్రీడాకారులతో ఉపాధ్యాయులు

దొనకొండ: ప్రకాశం జిల్లా విద్యా శాఖ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ సమైఖ్య ఆధ్వర్యంలో సాఫ్ట్‌బాల్ 14, 17 సంవత్సరాల బాల బాలికల జిల్లా స్థాయి ఎంపికలు చీమకుర్తి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించారు. స్థానిక జెడ్పీ పాఠశాల నుంచి క్రీడాకారులు పాల్గొని ప్రతిభ చూపటంతో రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని వ్యాయామ ఉపాధ్యాయుడు కె.నరసింహారావు తెలిపారు. రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన అండర్-14 పీవీఎల్ నారాయణ, శివశంకరరెడ్డి, అండర్-17కి భాను ప్రణీత్, బి.చంద్రశేఖర్, సుమిత్ర, గంగా భవాని ఎంపికయ్యారు. వీరు త్వరలో జరగబోయే రాష్ట్ర స్థాయి పోటీల్లో ప్రకాశం జిల్లా జట్టు తరఫున పాల్గొంటారన్నారు. వారికి పాఠశాలల్లో గురువారం ప్రధానోపాధ్యాయుడు వీవీ రామాంజనేయులు ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

108 ఉద్యోగుల సమ్మె నోటీసు



ఏఓకు వినతిపత్రం అందజేస్తున్న బాషా, నరేష్

కురిచేడు: తమ సమస్యలు పరిష్కరించనందున సమ్మె నోటీసును గురువారం మండల స్థాయి అధికారులకు 108 సిబ్బంది కురంగి నరేష్‌కుమార్, షేక్ మహబూబ్ బాషా అందజేశారు. 108 వ్యవస్థలో నిర్వహణ సంస్థలను మార్పు చేసే ప్రతిసారి ఉద్యోగుల గ్రాట్యుటీ, ఎరన్ లీవ్ అమౌంట్, వార్షిక ఇంక్రిమెంట్లు చెల్లించకుండా సంస్థలు వైదొలుగుతున్నాయన్నారు. తెలంగాణ రాష్ట్రంలోలా వైద్య ఆరోగ్యశాఖలో వెయిటేజీ ఇచ్చి నియామకాల్లో ప్రాధాన్యం కల్పించాలని, పాతవేతన స్లాబ్‌లను అప్డేట్ చేయాలని, మరమ్మతులకు గురైన వాహనాలకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేపట్టాలని, ప్రజాదర్బార్‌లో మంత్రి లోకేష్ 108 నిర్వహణ సంస్థను తొలగిస్తున్నామని ప్రకటించటంతో నిర్వహణ సంస్థ నుంచి రావాల్సిన వార్షిక ఇంక్రిమెంట్ బకాయిలు, జీతాల బకాయిలు, ఎరన్ లీవులకు సంబంధించిన నగదు ఉద్యోగులకు చెల్లించాలనే డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని అధికారులకు అందజేశారు.

క్యాన్సర్‌పై అవగాహన

తాళ్లూరు: మండలంలోని తూర్పుగంగవరంలో క్యాన్సర్ వ్యాధిపై గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి కె.మౌనిక తన సిబ్బందితో కలిసి గ్రామంలో ఇంటింటికీ వెళ్లి ప్రజలను కలిసి నోటి క్యాన్సర్, గర్భక్యాన్సర్, రొమ్ము క్యాన్సర్ వంటి రకాల గురించి వివరించారు. మౌనిక మాట్లాడుతూ ఎలాంటి సమస్యలు ఉన్నా ఆస్పత్రికి వచ్చి వెంటనే చూయించుకోవాలని చెప్పారు. ఎల్లప్పుడూ ఆస్పత్రిలో అందుబాటులో ఉంటామని, ఎటువంటి అనుమానాలు ఉన్నా నివృత్తి చేసుకోవాలన్నారు.



క్యాన్సర్‌పై అవగాహన కల్పిస్తున్న డాక్టర్ మౌనిక